పవిత్ర మాసాలలో పాపాల ప్రమాదం – షేఖ్ హబీబుర్ రహ్మాన్ జామిఈ [వీడియో & టెక్స్ట్]

teluguislam.net చే — జూన్ 28, 2026

పవిత్ర మాసాలలో పాపాల ప్రమాదం - షేఖ్ హబీబ
తెలుగుఇస్లాం.నెట్ (teluguislam.net)

ఇక్కడ చూడండి

పవిత్ర మాసాలలో పాపాల ప్రమాదం

షేఖ్ హబీబుర్ రహ్మాన్ జామిఈ [వీడియో & టెక్స్ట్]

https://youtu.be/2Vh-tmsTEZc [38 నిముషాలు]

ఈ ప్రసంగం ఇస్లాంలోని పవిత్ర మాసాల (ముహర్రం, రజబ్, జుల్ ఖాదా మరియు జుల్ హిజ్జా) విశిష్టతను మరియు ఆ మాసాలలో పాపాలకు దూరంగా ఉండవలసిన ఆవశ్యకతను వివరిస్తుంది. అల్లాహ్ పన్నెండు నెలల్లో నాలుగింటిని ప్రత్యేకంగా పవిత్రమైనవిగా ప్రకటించారని, ఈ కాలంలో చేసే సత్కార్యాలకు ప్రతిఫలం పెరగడమే కాకుండా, చేసే పాపాల తీవ్రత మరియు వాటి శిక్ష కూడా ఇతర సమయాల కంటే అధికంగా ఉంటాయని ఖురాన్ మరియు హదీసుల ఆధారంగా వివరించారు. పాపాలు సంఖ్యాపరంగా పెరగకపోయినా, పవిత్ర స్థలాలు మరియు కాలాల గౌరవాన్ని బట్టి వాటి ప్రభావం తీవ్రమవుతుందని, ఇవి హృదయాలకు తుప్పు పట్టించి మనిషిని అల్లాహ్ కరుణకు దూరం చేస్తాయని ఆయన హెచ్చరించారు.

అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు.

అల్ హమ్దులిల్లాహి మలికిల్ ఖుద్దూసిస్సలాం, ముజ్రిల్లయాలి వల్ అయ్యాం, వ ముజద్దిదిష్ షుహూరి వల్ ఆవాం. వస్సలాతు వస్సలాము అలా నబియ్యినా ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం), వ అలా ఆలిహిల్ కిరాం, వ సహ్బిహిల్ బరరాతిల్ ఆలాం, వత్తాబియీన లహుమ్ బి ఇహ్సాన్.

సర్వస్తోత్రాలు, అన్ని విధాల పొగడ్తలు, సకల ప్రశంసలు సర్వలోక ప్రభువైన, పాలకుడైన, ఏకైక సృష్టికర్త అయిన అల్లాహ్ కే శోభిస్తాయి. అనంత కరుణాశుభాలు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై, ఆయన కుటుంబీకులపై, ఆయన ప్రియ సహచరులపై అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా తన అనుగ్రహాలను వర్షింపజేయుగాక.

పవిత్ర మాసాల ప్రాముఖ్యత

అభిమాన సోదరులారా! ఈరోజు అంశం మీకందరికీ తెలిసిందే, "**పవిత్ర మాసాలలో పాపాల ప్రమాదం**". ఇస్లాంలో నాలుగు మాసాలను అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా ప్రత్యేక పవిత్రతతో గౌరవించాడు. అవి **జుల్ ఖాదా, జుల్ హిజ్జా, ముహర్రం మరియు రజబ్**. ఇందులో జుల్ ఖాదా, జుల్ హిజ్జా, ముహర్రం వరుసగా వచ్చే మూడు నెలలు. రజబ్ ఇది జమాదా మరియు షాబాన్ మధ్యలో ఉంటుంది. దీని ప్రస్తావన అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా సూరహ్ తౌబా ఆయత్ 36 లో ఇచ్చాడు:

إِنَّ عِدَّةَ ٱلشُّهُورِ عِندَ ٱللَّهِ ٱثْنَا عَشَرَ شَهْرًا فِى كِتَٰبِ ٱللَّهِ يَوْمَ خَلَقَ ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضَ مِنْهَآ أَرْبَعَةٌ حُرُمٌ ۚ ذَٰلِكَ ٱلدِّينُ ٱلْقَيِّمُ ۚ فَلَا تَظْلِمُوا۟ فِيهِنَّ أَنفُسَكُمْ

నిశ్చయంగా అల్లాహ్ వద్ద నెలల సంఖ్య పన్నెండు. ఆకాశాలనూ, భూమినీ సృష్టించిన రోజు నుండి అల్లాహ్ గ్రంథంలో అవి పన్నెండే. వాటిలో నాలుగు పవిత్రమైనవి. ఇదే సరైన ధర్మం. కాబట్టి ఆ నెలలలో మీరు మీపై అన్యాయం చేసుకోకండి. (9:36)

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "**సంవత్సరంలో పన్నెండు నెలలు ఉన్నాయి. వాటిలో నాలుగు పవిత్రమైనవి.**

వాటిలో మూడు వరుసగా వచ్చే జుల్ ఖాదా, జుల్ హిజ్జా, ముహర్రం. మరొకటి జుమాదా మరియు షాబాన్ మధ్యలో ఉన్న రజబ్ మాసం." ఇది సహీహ్ బుఖారీ మరియు సహీహ్ ముస్లిం లో ఉన్న హదీసు.

సత్కార్యాల ప్రతిఫలం మరియు పాపాల తీవ్రత

అభిమాన సోదరులారా! పవిత్ర మాసాలలో సత్కార్యాల ప్రతిఫలం మరియు పాపాల శిక్ష వాటి గొప్పతనం మరియు తీవ్రత పరంగా పెరుగుతాయని తెలుస్తుంది. అంటే పవిత్ర మాసాలలో పుణ్యాలు చేసినా వాటి ప్రతిఫలం ఎన్నో రెట్లు పెరుగుతుంది. అలాగే పాపాలు చేసినా పాపాల శిక్ష వాటి గొప్పతనం మరియు తీవ్రత పరంగా పెరుగుతాయని తెలుస్తుంది. కాబట్టి పవిత్ర మాసాలలో చేసే ఒక సత్కార్యం ఇతర సాధారణ కాలాలలో చేసే అదే సత్కార్యం కంటే అల్లాహ్ వద్ద మరింత గొప్పది. అలాగే పవిత్ర మాసాలలో చేసే ఒక పాపం ఇతర సాధారణ కాలాలలో చేసే అదే పాపం కంటే మరింత తీవ్రమైనది మరియు భారమైనది.

ఒక ప్రశ్న: పవిత్ర మాసాలలో పాపం రెట్టింపు అవుతుందా? అంటే ఒక పాపం రెండు పాపాలకి సమానంగా, నాలుగు పాపాలకి సమానంగా, పది పాపాలకి సమానంగా అవుతుందా? ఈ ప్రశ్న. దీనికి సమాధానం ధార్మిక పండితులు ఇలా వివరించారు: పవిత్ర మాసాలలో సత్కార్యాలు మరియు పాపాలు రెట్టింపు అవుతాయని స్పష్టంగా తెలిపే సహీహ్ మరియు స్పష్టమైన హదీసులు లేవు. అయితే కొందరు పండితులు అల్లాహ్ ఈ విధంగా చెప్పినందున ఈ మాసాలలో సత్కార్యాల ప్రతిఫలం మరియు పాపాల తీవ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. సూరహ్ తౌబా ఆయత్ 36: "**ఫలా తజ్లిమూ ఫీహిన్న అన్ఫుసకుమ్**." కాబట్టి ఆ పవిత్ర మాసాలలో మీపై మీరు అన్యాయం చేసుకోకండి.

ఈ ఆయత్ యొక్క తఫ్సీర్ ను వివరిస్తూ ఇబ్నె కసీర్ రహ్మతుల్లాహి అలైహి ఇలా పేర్కొన్నారు:

ఆ మాసాలలో మీపై మీరు అన్యాయం చేసుకోకండి అంటే ఈ పవిత్ర మాసాలలో పాపాలకు దూరంగా ఉండండి. ఎందుకంటే ఈ మాసాలలో పాపం చేయడం ఇతర సమయాల్లో పాపం చేయడం కంటే మరింత తీవ్రమైనది మరియు ఎక్కువ భారమైనది. ఎలాగైతే పవిత్ర నగరమైన మక్కాలో చేసిన పాపాలు మరింత ఘోరమైనవిగా పరిగణించబడతాయో, అలాగే ఈ పవిత్ర మాసాలలో చేసిన పాపాలు కూడా మరింత తీవ్రమైనవిగా పరిగణించబడతాయి.

అల్లాహ్ సుబ్ హానహు వ త’ఆలా సూరహ్ హజ్ లో సెలవిచ్చాడు:

وَمَن يُرِدْ فِيهِ بِإِلْحَادٍ بِظُلْمٍ نُّذِقْهُ مِنْ عَذَابٍ أَلِيمٍ
(వ మయ్ యురిద్ ఫీహి బి ఇల్ హాదిమ్ బిజుల్మిన్ నుజిఖ్ హు మిన్ అజాబిన్ అలీమ్)

ఎవడు అందులో (మస్జిదే హరామ్ లో) అన్యాయపూర్వకంగా మార్గభ్రష్టతను కోరుకుంటాడో అతనికి మేము బాధాకరమైన శిక్షను రుచి చూపిస్తాము. (22:25)

అంటే పవిత్ర మాసాలలో పాపాల తీవ్రత, పాప భారం మరియు అల్లాహ్ దృష్టిలో వాటి ఘోరత పెరిగిపోతుంది. అందువల్ల ఈ మాసాలలో పాపాలకు దూరంగా ఉండి తౌబా, నమాజ్, ఖురాన్ పఠనం, జిక్ర్ మరియు ఇతర సత్కార్యాలను ఎక్కువగా చేయాలి.

హాఫిజ్ ఇబ్నె కసీర్ రహ్మతుల్లాహి అలైహి ఇలా వివరించారు: ***పవిత్ర మాసాలలో పాపాలు మరింత తీవ్రమవుతాయి***. అందువల్ల ఇమామ్ షాఫీ రహ్మతుల్లాహి అలైహి మరియు అనేకమంది పండితుల అభిప్రాయం ప్రకారం, ***ఈ మాసాలలో హత్య జరిగినట్లయితే 'దియత్' (రక్త పరిహారం) మరింత కఠినంగా పరిగణించబడుతుంది. అలాగే హరమ్ ప్రాంతంలో హత్య చేసిన వారికి లేదా నిషిద్ధ బంధుత్వం (మహరమ్) కలిగిన వ్యక్తిని హత్య చేసిన వారికి కూడా ఇదే వర్తిస్తుంది***. ఆ తర్వాత ఆయన ఖతాదా గారి మాటలను ఉటంకించారు. అవేమిటి? ***పవిత్ర మాసాలలో జరిగే అన్యాయం ఇతర సమయాల్లో జరిగే అన్యాయం కంటే మరింత పెద్ద పాపం మరియు ఎక్కువ భారమైనది.***

అయితే అన్యాయం ఎలాంటి పరిస్థితుల్లోనైనా గొప్ప పాపమే. అన్యాయం అన్యాయమే, ప్రతి సందర్భంలో ప్రతి పరిస్థితిలో అది గొప్ప పాపమే అవుతుంది, ఘోరమైన పాపమే అవుతుంది. కానీ అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా తన ఇష్టానుసారం కొన్ని విషయాలకు మరింత గొప్పతనాన్ని మరియు ప్రాముఖ్యతను ప్రసాదిస్తాడు. అలాగే ఈ ప్రత్యేకత ఈ నాలుగు మాసాలకు అల్లాహ్ ప్రసాదించాడు.

ఇమామ్ ఖుర్తుబీ రహ్మతుల్లాహి అలైహి ఇలా అన్నారు:

"ఈ పవిత్ర మాసాలలో పాపాలు చేసి మీరు మీపై అన్యాయం చేసుకోకండి. ఎందుకంటే అల్లాహ్ ఒక విషయాన్ని ఒక కోణం నుండి గౌరవప్రదంగా చేసినప్పుడు దానికి ఒక ప్రత్యేకత, పవిత్రత ఉంటుంది. కానీ రెండు లేదా అంతకంటే ఎక్కువ కోణాల నుండి దానిని గొప్పదిగా చేసినప్పుడు దాని పవిత్రత, దాని యొక్క గౌరవం మరింత పెరిగిపోతుంది. అందువల్ల అలాంటి సమయాల్లో లేదా ప్రదేశాల్లో చేసిన చెడు పనికి శిక్ష మరింత

తీవ్రమైపోతుంది. అలాగే చేసిన సత్కార్యానికి ప్రతిఫలం కూడా మరింత గొప్పదిగా ఉంటుంది.”

అభిమాన సోదరులారా! పవిత్ర మాసంలో పవిత్ర స్థలమైన మక్కాలో అల్లాహ్ కు విధేయత చూపిన వారి ప్రతిఫలం సాధారణ నెలలలో అదే మక్కాలో విధేయత చూపిన వారి ప్రతిఫలంతో సమానం కాదు. అలాగే సాధారణ నెలలో మక్కాలో చేసిన సత్కార్యానికి లభించే ప్రతిఫలం, సాధారణ నెలలో సాధారణ ప్రదేశంలో చేసిన సత్కార్యానికి లభించే ప్రతిఫలంతో సమానం కాదు.

సారాంశం ఏమిటంటే పవిత్ర కాలాలు అంటే ఇది ముహర్రం, రజబ్, జుల్ ఖాదా, జుల్ హిజ్జా. పవిత్ర ప్రదేశాలు మక్కా, మదీనా వగైరా అల్లాహ్ వద్ద ప్రత్యేక గౌరవం కలిగినవి. అందువల్ల వాటిలో చేసే సత్కార్యాలకు మరింత గొప్ప ప్రతిఫలం లభిస్తుంది. వాటిలో చేసే పాపాలు మరింత తీవ్రమైనవిగా పరిగణించబడతాయి. కాబట్టి ఈ పవిత్ర మాసాలలో ముస్లింలు పాపాలకు దూరంగా ఉండాలి. సత్కార్యాలలో అధికంగా పాల్గొనాలి. పాపం ఎప్పుడూ చేయకూడదు. పూర్తి సంవత్సరం పన్నెండు మాసాలు చేయకూడదు. ముఖ్యంగా, ప్రత్యేకంగా పవిత్ర మాసాలలో ఎందుకంటే దాని యొక్క తీవ్రత పెరిగిపోతుంది.

షరియత్ ఆధారాల ద్వారా నిరూపితమైన విషయం ఏమిటంటే పవిత్ర కాలాలలో మరియు పవిత్ర ప్రదేశాలలో సత్కార్యాల ప్రతిఫలం మరింత పెరుగుతుంది. ఉదాహరణకు రంజాన్ మాసం, జుల్ హిజ్జా మాసం అలాగే ఈ ముహర్రం మాసం వంటి పవిత్ర కాలాలలో సత్కార్యాల ప్రతిఫలం అధికంగా ఉంటుంది. అలాగే మస్జిదుల్ హరామ్ మక్కా, మస్జిద్ నబవీ మదీనా వంటి పవిత్ర ప్రదేశాలలో కూడా సత్కార్యాలకు ప్రత్యేకమైన గొప్ప ప్రతిఫలం లభిస్తుంది.

జాబిర్ రజియల్లాహు అన్హు ద్వారా వచ్చిన ఒక సహీహ్ హదీసులో ఇలా ఉంది: మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారు: "**నా మస్జిద్ అంటే మస్జిద్ నాబవి లో చేసిన ఒక నమాజ్, మస్జిదుల్ హరామ్ తప్ప ఇతర ఏ ప్రదేశంలో చేసిన వెయ్యి నమాజుల కంటే ఉత్తమమైనది. మరియు మస్జిదుల్ హరామ్ లో చేసిన ఒక నమాజ్ ఇతర ప్రదేశాలలో చేసిన లక్ష నమాజుల కంటే ఉత్తమమైనది.**" ఈ హదీసును ప్రముఖ ముహద్దిసీన్లు సహీహ్ గా నిర్ధారించారు. ఈ హదీసు యొక్క సనద్ పరంపర సహీహ్ బుఖారీ మరియు సహీహ్ ముస్లిం ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుంది.

అభిమాన సోదరులారా! పవిత్ర కాలాలలో సత్కార్యాల ప్రతిఫలం ఎక్కువగా ఉంటుంది, పవిత్ర ప్రదేశాలలో చేసిన ఆరాధనలు మరింత గొప్ప ఫలితాన్ని కలిగిస్తాయి. అందువల్ల రంజాన్ మాసం, జుల్ హిజ్జా ముఖ్యంగా జుల్ హిజ్జా మొదటి పది రోజులు, ముహర్రం వంటి పవిత్ర కాలాలను మరియు మక్కా మదీనా వంటి పవిత్ర ప్రదేశాలను సత్కార్యాలతో సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి చిన్న పెద్ద పాపం నుండి అవిధేయత నుండి దూరంగా ఉండాలి. దుష్ట క్రియలు పాపాలు గురించి పండితుల అభిప్రాయం ప్రకారం, ధార్మిక పండితుల అభిప్రాయం ప్రకారం మనం చేసే పాపాలు ఈ పవిత్ర కాలాలలో మాసాలలో అవి సంఖ్యాపరంగా పెరగవు. సంఖ్యాపరంగా పెరగవు అంటే ఒక పాపం పది పాపాలుగా లెక్కించబడవు. కానీ వాటి తీవ్రత లేదా స్వభావం పరంగా పెరుగుతాయి. ఎందుకంటే అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా సూరహ్ అన్ ఆమ్ లో సెలవిచ్చాడు:

مَن جَآءَ بِٱلْحَسَنَةِ فَلَهُۥ عَشْرُ أَمْثَالِهَا ۖ وَمَن جَآءَ بِٱلسَّيِّئَةِ فَلَا يُجْزَىٰٓ إِلَّا مِثْلَهَا وَهُمْ لَا يُظْلَمُونَ

ఎవరైనా ఒక పుణ్యం చేస్తే అతనికి దాని పదింతల ప్రతిఫలం లభిస్తుంది.

కానీ ఎవరైనా ఒక చెడు చేస్తే అతనికి దాని సమానమైన శిక్ష మాత్రమే ఇవ్వబడుతుంది. వారికి ఎటువంటి అన్యాయం చేయబడదు. (6:160)

కాబట్టి రంజాన్ మాసంలో గానీ, ముహర్రం మాసంలో గానీ లేదా మరెక్కడైనా గానీ పాపాలు సంఖ్యాపరంగా పెరగవు, పాపం ఎప్పుడూ ఒకటిగానే లెక్కించబడుతుంది. ఇది అల్లాహ్ యొక్క అపారమైన కరుణ మరియు అనుగ్రహం. అయితే, అయితే ఇది మనం ముఖ్యంగా గమనించాల్సిన విషయం. **పాపం యొక్క తీవ్రత ప్రదేశం మరియు సమయాన్ని బట్టి మారుతుంది**. సాధారణమైన మాసంలో చేసే పాపం, పవిత్ర మాసంలో చేసే పాపం సమానం కావు. తీవ్రత పెరిగిపోతుంది. దాని ప్రభావం పెరిగిపోతుంది. పవిత్ర స్థలాలు మక్కా హరమ్ లో చేసే పాపం ఇతర నగరాలలో చేసే పాపం కంటే చాలా తీవ్రమైనది, పెద్దది. అలాగే పవిత్ర మాసాలలో చేసే పాపం ఇతర నెలలలో చేసే పాపం కంటే అత్యంత ఘోరమైనది మరియు తీవ్రమైనది అని మనం మర్చిపోకూడదు.

పాపాలు మక్కాలో కూడా పుణ్యాల వలే రెట్టింపు మొత్తం పరంగా అవుతాయని సామాన్య ప్రజలు చెబుతుంటారు. ఈ మాట సరైనది కాదు. ఎందుకంటే పాపాలు రెట్టింపు కావడం ఖచ్చితంగా నిషిద్ధం. అల్లాహ్ ఎలా సెలవిచ్చాడు: "**ఎవరైనా ఒక పాపం చేస్తే అతనికి దాని సమానమైన శిక్ష మాత్రమే ఇవ్వబడుతుంది.**" ఇది పాపాలు రెట్టింపు కావు అని స్పష్టంగా చెబుతున్న ఖురాన్ ఆయత్. అయితే గమనించాల్సిన విషయం ఏమిటంటే మక్కా వంటి పవిత్ర స్థలాల్లో పాపం యొక్క తీవ్రత పెరిగిపోతుంది. ఎందుకంటే సమయం మరియు స్థలం యొక్క పవిత్రతను బట్టి పాపం యొక్క తీవ్రత మారుతుంది. పాపం ఎంత తీవ్రమైతే శిక్ష కూడా అంత ఎక్కువగా ఉంటుంది. పాపం ఎంత చిన్నదైతే శిక్ష అంత తక్కువగా ఉంటుంది. కాబట్టి ఇక్కడ శిక్ష పెరగడం అనేది పాపం యొక్క తీవ్రత పెరగడం వల్ల జరుగుతుంది.

అందుకే మక్కా హరమ్ గురించి అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా ఇలా సెలవిచ్చాడు – ఇది సూరహ్ హజ్ లో ఉంది ఆయత్ 25 లో: "**మరియు ఎవరైనా అందులో అన్యాయంతో కూడిన ధర్మ విరుద్ధమైన పనిని చేయాలని సంకల్పిస్తే వారికి మేము బాధాకరమైన శిక్షను రుచి చూపిస్తాము**." అలాగే పవిత్ర మాసాల గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "**ఫలా తజ్లిమూ ఫీహిన్న అన్ఫుసకుమ్." కావున ఆ మాసాలలో మీరు మీకు అన్యాయం చేసుకోకండి**. దీని అర్థం ఏమిటి? పవిత్ర మాసాలు కానీ ఇతర సమయాల్లో కూడా తమకు తాము అన్యాయం చేసుకోవడం, పాపం నిషిద్ధమే. కానీ పవిత్ర మాసాల్లో దాని తీవ్రత మరియు శిక్ష చాలా ఎక్కువగా ఉంటుంది.

పాపాల ప్రభావం మరియు అల్లాహ్ హెచ్చరిక

అభిమాన సోదరులారా! **షేక్ ఇబ్నె ఉసైమీన్ రహ్మతుల్లాహి అలైహి** ఇలా అన్నారు: మక్కాలో చేసిన పాపాలు సంఖ్యాపరంగా పెరగవు అయితే వాటి తీవ్రత గొప్పతనం పరంగా పెరుగుతాయి. అంటే వాటికి విధించబడే శిక్ష మరింత కఠినంగా మరియు బాధాకరంగా ఉంటుంది. దీనికి ఆధారం అల్లాహ్ యొక్క ఈ ఆయత్ సూరహ్ అన్ ఆమ్ 160: "**ఎవడు ఒక సత్కార్యం చేస్తాడో అతనికి దానికి పదిరెట్లు ప్రతిఫలం ఉంటుంది మరియు ఎవడు ఒక పాపం చేస్తాడో అతనికి దాని సమానమైన శిక్ష మాత్రమే ఇవ్వబడుతుంది. వారికి ఎటువంటి అన్యాయం చేయబడదు**." ఈ ఆయత్ స్పష్టంగా పాపాలు సంఖ్యాపరంగా రెట్టింపు కావు అని తెలియజేస్తుంది.

అయితే అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా మరొక చోట ఇలా సెలవిచ్చాడు: "వ మయ్ యురిద్ ఫీహి బి ఇల్ హాదిమ్ బిజుల్మిన్ నుజిఖ్ హు మిన్ అజాబిన్ అలీమ్." **ఎవడు హరమ్ ప్రాంతంలో అన్యాయపూర్వకంగా మార్గభ్రష్టతను కోరుకుంటాడో అతనికి మేము బాధాకరమైన శిక్షను రుచి చూపిస్తాము.**

అంటే మక్కాలో చేసిన పాపానికి వచ్చే శిక్ష అదే పాపాన్ని మక్కా వెలుపల చేసినప్పుడు వచ్చే శిక్ష కంటే మరింత కఠినంగా ఉంటుంది. ఇందులో మక్కాలో పాపాల నుండి దూరంగా ఉండాలని తీవ్రమైన హెచ్చరిక ఉంది. ఈ ఆయత్ ద్వారా తెలిసేది ఏమిటంటే హరమ్ లో చేసిన పాపం అత్యంత ఘోరమైనది. కేవలం పాపం చేయాలనే సంకల్పం లేదా ఉద్దేశం కూడా తీవ్రమైన హెచ్చరికకు కారణమవుతుంది. మరి వాస్తవంగా ఆ పాపాన్ని చేసిన ఆ వ్యక్తి యొక్క పాప భారం ఎంత తీవ్రమై ఉంటుందో ఊహించవచ్చు.

అభిమాన సోదరులారా! ఇక సారాంశం ఏమిటంటే మక్కా లేదా హరమ్ ప్రాంతంలో పాపాల యొక్క తీవ్రత పెరిగిపోతుంది. హరమ్ ప్రాంతంలో పాపం చేయాలనే ఆలోచనకే అల్లాహ్ తీవ్రమైన హెచ్చరిక చేశాడు. అలాగే పవిత్ర మాసాలలో కూడా పాపం చేస్తే దాని తీవ్రత, దాని ప్రభావం పెరిగిపోతుంది ఎక్కువగా ఉంటుంది. కావున మనము ఈ పవిత్ర మాసాలను గౌరవించాలి. పవిత్ర మాసాలను గౌరవించడం అంటే ఏంటి? ప్రతి చిన్న పెద్ద పాపం నుండి అవిధేయత నుండి తప్పుల నుండి దూరంగా ఉండాలి. సదాచారాలు, సత్కార్యాలు, పుణ్యకార్యాలు, మంచి పనులు ఎక్కువగా చేయాలి. దుఆ లు, జిక్ర్, నఫిల్ ఉపవాసాలు, ఖురాన్ పారాయణము వగైరా వగైరా.

"ఫలా తజ్లిమూ ఫీహిన్న అన్ఫుసకుమ్." ఈ ఆయత్ లోని జుల్మ్ (దౌర్జన్యం) అంటే ఏమిటి? దౌర్జన్యం యొక్క అర్థం ఏమిటంటే ప్రత్యేకంగా ఈ నాలుగు మాసాలలో మీరు అల్లాహ్ అవిధేయతకు దూరంగా ఉండండి. ఎందుకంటే వీటిలో అవిధేయత పాపం ఎన్నో రెట్లు పెరిగిపోతుంది.

హాఫిజ్ ఇబ్నె కసీర్ రహ్మతుల్లాహి అలైహి హజ్రత్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్హు యొక్క ఉల్లేఖనాన్ని హదీసును ఇలా తెలియజేశారు:

“అల్లాహ్ దౌర్జన్యాన్ని సంవత్సరపు పన్నెండు మాసాల్లోనూ నిషేధించాడు. తదుపరి నాలుగు మాసాలను వాటిలో ప్రత్యేకంగా ఖరారు చేశారు. ఎందుకంటే వీటిలో చెడు, అవిధేయతల పాపం పెరుగుతుంది మరియు మంచి సదాచారణల పుణ్యం కూడా ఎన్నో రెట్లు పెరుగుతుంది.”

ఇమామ్ ఖతాదా ఈ ఆయత్ గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా వివరించారు: **దౌర్జన్యం పాపం ఎల్లప్పుడూ ఎక్కువగా ఉన్నప్పటికీ, కానీ ప్రత్యేకంగా నిషిద్ధ మాసాలలో దీని పాపం మరియు బరువు ఇతర మాసాల కన్నా ఎన్నో రెట్లు పెరిగిపోతుంది. తీవ్రత పెరిగిపోతుంది**.

దైవదూతల్లో ఈ విధంగా అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా దైవదూతల్లో కొందరిని ప్రత్యేకంగా సందేశహరులుగా చేశాడు. గ్రంథాలలో దివ్య ఖురాన్ ను, యావత్ భూమిలో మసీదులను, అలాగే మాసాల్లో రంజాన్ నెల మరియు నిషిద్ధ మాసాలతో పాటు అనుకున్నట్లే దినాలలో శుక్రవారాన్ని, రాత్రుల్లో లైలతుల్ ఖదర్ ను అల్లాహ్ అనుకున్నట్లే ఏ మాసంలో పాప ఫలాన్ని అధికం చేయాలో మరియు దేనికి గొప్పతనం ప్రసాదించాలో పూర్తిగా అల్లాహ్ ఇష్టం. అంటే ఏ విధంగానైతే అల్లాహ్ మాసాలలో రంజాన్ యొక్క ప్రత్యేకత ఎంచుకున్నాడో ఖురాన్ గురించి, అలాగే పవిత్ర నాలుగు మాసాలు అల్లాహ్ ఎంచుకున్నాడో, దైవదూతల్లో జిబ్రయీల్ ను అల్లాహ్ ఎంచుకున్నాడో ఆ విధంగా ఈ మాసాలలో. అల్లాహ్ తన ఇష్టానుసారం అది పూర్తిగా అతని ఇష్టం. అందుకే అల్లాహ్ దేన్నైతే గొప్పదిగా భావిస్తాడో మీరు కూడా దానిని గొప్పదిగా భావించండి అని ఖతాదా రహ్మతుల్లాహి అలైహి వివరించాడు. అల్లాహ్ దేనికి గొప్పదిగా భావించాడో మనం కూడా దానిని గొప్పదిగా భావించాలి. ఈ వివరం ఇబ్నె కసీర్ భాగం రెండులో ఉంది.

ప్రియ సోదరులారా! సంవత్సరం పొడుగునా ప్రత్యేకించి ఈ నాలుగు మాసాల్లో మనం అల్లాహ్ అవిధేయత నుండి దూరంగా ఉండాలి మరియు పాప కార్యాలను త్యజించాలి. ఎందుకంటే అవిధేయత మరియు పాప కార్యాల మూలంగా **హృదయాలకు తుప్పు పడుతుంది**. అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా సూరహ్ ముతఫ్ఫిఫీన్ లో సెలవిచ్చాడు:

كَلَّا ۖ بَلْ ۜ رَانَ عَلَىٰ قُلُوبِهِم مَّا كَانُوا۟ يَكْسِبُونَ
(కల్లా బల్ రాన అలా ఖులూబిహిమ్ మా కానూ యక్ సిబూన్)
ఎంతమాత్రం కాదు! అసలు వారి హృదయాలకు వారు చేసిన దుష్కార్యాల తుప్పు పట్టింది. (83:14)

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఇన్నల్ ములమిన ఇజా అజ్ నబ జంబన్ కానత్ నుఖ్ తతన్ సౌదా ఫీ ఖల్ బిహి, ఫ ఇన్ తాబ వ నజఅ వస్తఘ్ ఫర సఖల మిన్ హా." అంటే ఈ హదీసు తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా లో ఉంది. దానికి అర్థం ఏమిటంటే: **విశ్వాసి ఏదైనా దుష్కార్యం పాపం చేసినప్పుడు అతని హృదయంలో ఒక నల్లటి మచ్చ ఏర్పడుతుంది. తదుపరి ఒకవేళ అతను పశ్చాత్తాపం చెంది ఆ దుష్కార్యాన్ని త్యజించి పాపాన్ని వదిలి క్షమించమని అల్లాహ్ ను వేడుకుంటే అతని హృదయాన్ని శుభ్రం చేయడం జరుగుతుంది. ఆ నల్లటి మచ్చ అల్లాహ్ తీసేసి కడిగేస్తాడు హృదయం నుంచి. ఒకవేళ అతను ఒక దుష్కార్యం తర్వాత మరో దుష్కార్యం ఒక పాపం తర్వాత మరో పాపం ఈ విధంగా చేస్తూ పోతూ ఉంటే అతని హృదయంలో నల్లటి మచ్చ పెరుగుతూ పోయి చివరికి పూర్తి హృదయాన్ని ఆక్రమించుకుంటుంది**. దీనినే అల్లాహ్ ఖురాన్ లో **రాన్** అన్నాడు: "కల్లా బల్ రాన అలా ఖులూబిహిమ్." హృదయాలకు తుప్పు పట్టడం.

అభిమాన సోదరులారా! ఇక పాపాల ప్రమాదం లేకపోతే ప్రభావం సాధారణంగా ఎప్పుడు చేసినా చాలా కఠినంగా ఉంటుంది. ఉదాహరణకు నేను ఒక రెండు మూడు ఉదాహరణలు చెప్పి నేను ముగిస్తాను సారాంశంగా, వివరణకు పోకుండా. పాపాల మూలంగా అల్లాహ్ యొక్క ఆగ్రహానికి గురవుతాము ఎప్పుడు పాపం చేసినా. మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారు: "ఇయ్యాక వల్ మాసియ ఫ ఇన్న బిల్ మాసియతి హల్ల సఖితుల్లాహి అజ్జ వజల్ల." **అల్లాహ్ కు అవిధేయత చూపకండి అంటే పాపం చేయకండి. ఎందుకు పాపాల వల్ల అల్లాహ్ ఆగ్రహానికి గురవుతాము**. ఈ హదీసు ముస్నద్ అహ్మద్ లో ఉంది.

అలాగే అల్లాహ్ సెలవిచ్చాడు సూరహ్ హజ్ లో: **అల్లాహ్ పరాభవం పాలుజేసిన వాడికి ఎవ్వరూ ఆదరించరు. అలాగే పాపాల మూలంగా దాసుడు సైతాన్ బందీ అయిపోతాడు** సూరహ్ జుఖ్రుఫ్ ఆయత్ 36:

وَمَن يَعْشُ عَن ذِكْرِ ٱلرَّحْمَـٰنِ نُقَيِّضْ لَهُۥ شَيْطَـٰنًا فَهُوَ لَهُۥ قَرِينٌ
(వ మయ్ యఅషు అన్ జిక్రిర్ రహ్మాని నుఖయ్యిజ్ లహు షైతానన్ ఫహువ లహు ఖరీన్)
కరుణామయుని స్మరణ పట్ల గుడ్డిగా వ్యవహరించే వ్యక్తిపై మేము షైతానును నియమిస్తాము, ఇక వాడు అతనికి సహవాసిగా ఉండిపోతాడు. (43:36)

సైతాన్. అలాగే పాపాల వల్ల మనిషి తన్ను తానే మర్చిపోతాడు సూరహ్ హషర్ ఆయత్ 19:

وَلَا تَكُونُوا۟ كَٱلَّذِينَ نَسُوا۟ ٱللَّهَ فَأَنسَىٰهُمْ أَنفُسَهُمْ ۚ أُو۟لَـٰٓئِكَ هُمُ ٱلْفَـٰسِقُونَ
(వలా తకూనూ కల్లజీన నసుల్లాహ ఫ అన్సాహుమ్ అన్ఫుసహుమ్ ఉలాయిక

హుముల్ ఫాసిఖూన్)

మరియు మీరు అల్లాహ్ ను మరిచిపోయిన వారి మాదిరిగా అయిపోకండి. వారి ఈ విస్మరణ కారణంగా అల్లాహ్ కూడా వారిని తమ ఆత్మలనే మరిచిపోయిన వారిగా చేసేశాడు. అలాంటి వారే పరమ అవిధేయులు. (59:19)

అలాగే పాపాల వల్ల జీవితం దుర్భరమైపోతుంది, మనశ్శాంతిని కోల్పోతాము. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు సూరహ్ తాహా లో:

وَمَنْ أَعْرَضَ عَن ذِكْرِى فَإِنَّ لَهُۥ مَعِيشَةً ضَنكًا وَنَحْشُرُهُۥ يَوْمَ ٱلْقِيَـٰمَةِ أَعْمَىٰ

(వ మన్ ఆరజ అన్ జిక్రీ ఫ ఇన్న లహు మఈషతన్ జంకా వ నహ్ శురుహూ యౌమల్ ఖియామతి అమా)

మరియు ఎవడు నా స్మరణ (ఖురాన్) పట్ల వైముఖ్యత చూపుతాడో అతని బ్రతుకు దుర్భరమవుతుంది. మరియు ప్రళయ దినాన మేము అతన్ని గుడ్డివానిగా చేసి లేపుతాము. (20:124)

ప్రపంచంలో శిక్ష ఏమిటి? దుర్భరమైపోతుంది, అశాంతి ఉంటుంది, అలజడి ఉంటుంది, సమస్యలు ఉంటాయి, మనశ్శాంతి ఉండదు, టెన్షన్ లో ఉంటాము ఈ ప్రపంచంలో. పరలోకంలో గుడ్డివానిగా లేపుతాము. అప్పుడు ఆ వ్యక్తి అల్లాహ్ కు అడుగుతాడు:

قَالَ رَبِّ لِمَ حَشَرْتَنِىٓ أَعْمَىٰ وَقَدْ كُنتُ بَصِيرًا

(ఖాల రబ్బి లిమ హషర్ తనీ అమా వ ఖద్ కుంతు బసీరా)

“ప్రభూ! నన్ను గుడ్డివానిగా చేసి లేపారేమిటీ? నాకు చూపు ఉండేదికదా!” అని అతను అంటాడు“ (20:125)

అప్పుడు అల్లాహ్ సమాధానం ఇస్తాడు:

قَالَ كَذَٰلِكَ أَتَتْكَ ءَايَٰتُنَا فَنَسِيتَهَا ۖ وَكَذَٰلِكَ ٱلْيَوْمَ تُنسَىٰ
(ఖాల కజాలిక అతత్ క ఆయాతునా ఫనసీత హా వ కజాలికల్ యౌమ తున్ సా)

“జరగవలసిన విధంగానే జరిగింది. (ఒకప్పుడు) నీ వద్దకు వచ్చిన మా ఆయతులను (వచనాలను, సూచనలను, మహిమలను) నువ్వు విస్మరించావు. అందుకే ఈనాడు నువ్వు కూడా విస్మరించబడుతున్నావు” అని అనబడుతుంది. (20:126)

ఇది పాపాల ప్రభావం. **పాపాల వల్ల ప్రస్తుతం అనుభవించే వరాలు అల్లాహ్ లాక్కుంటాడు.** దీనికి ఉదాహరణ ఆదమ్ అలైహిస్సలాం హవ్వా అలైహిస్సలాం స్వర్గంలో ఉన్నారు. దీని వివరణ సూరహ్ బఖరా లో ఉంది ఆయత్ 30, 31, 32. అల్లాహ్ వరాలను అనుభవిస్తూ ఉన్నారు అల్లాహ్ నేమత్ లను సుఖంగా సంతోషంగా హాయిగా టెన్షన్ లేదు ఏమీ లేదు. అక్కడ తప్పు జరిగింది అల్లాహ్ ఆ వరం తీసేసుకున్నాడు భూమిపైన వేసేశాడు. అంటే ఇది ఉదాహరణ. అలాగే ఉహుద్ సంఘటన, ఉహుద్ లో కొంతమంది సహాబాలకి వారు చేసిన ఆ పొరపాటు మూలంగా ఇది అయిపోయింది మనకు తెలిసిన విషయమే. అభిమాన సోదరులారా చెప్పడం ఏమిటంటే పాపాల వల్ల ఉపాధిలో కొరత వస్తుంది. మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారు: “వ ఇన్నర్ రజుల ల యుహ్రముర్ రిజ్ ఖ బి ఖతీఅతిన్ యుఅ మలుహా.” అంటే **మనిషి పాపం వల్ల అతనికి ఇవ్వబోయే ఆ రిజ్క్ కి మహ్రూమ్ అయిపోతాడు**. అల్లాహు అక్బర్.

అభిమాన సోదరులారా ఇవి ఎప్పుడు పాపం చేసినా దాని ప్రభావం. మరి ఇటువంటి పాపాలు, ఇటువంటి అన్యాయాలు, ఇటువంటి దౌర్జన్యాలు, ఇటువంటి అవిధేయతలు, ఇటువంటి ఘోరాలు, ఇటువంటి నేరాలు పవిత్ర మాసాలలో చేస్తే దాని తీవ్రత ఎలా ఉంటుంది? మనం ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఇప్పుడు నేను పాపాల ప్రభావం ప్రభావాలు కొన్ని చెప్పాను కొన్ని మాత్రమే. పాపం వల్ల రిజ్క్ మహ్రూమ్ అవుతాము. పాపం వల్ల అల్లాహ్ మనకు ఇప్పుడు ఇచ్చిన వరం ఇవ్వబోయే వరం రెండింటికి అల్లాహ్ దూరం చేసేస్తాడు. మనశ్శాంతి ఉండదు, శాంతి తీసేస్తాడు. ఇలాంటివి ఉన్నాయి కదా ఈ లోకంలో కూడా పరలోకంలో కూడా ఇవి ఎప్పుడు పాపం చేసినా. ఇటువంటి పాపాలు పవిత్ర మాసాలలో చేస్తే దాని ప్రభావం, దాని తీవ్రత ఎలా ఉంటుంది? మనం ఊహించుకోగలము.

ఇప్పుడు సుకూన్ అనేది శాంతి అనేది సుఖమైన జీవితం అనేది టెన్షన్ లేని జీవితం అనేది సాధారణంగా లేదు. ఎందుకు? డబ్బు ఉన్నా డబ్బు లేకపోయినా పేదవారు ధనవంతులు, మంచి హోదాలో ఉన్నవారు హోదా లేని ఉద్యోగం లేని వారు – అంటే పేదవారు మిడిల్ క్లాస్ వారు ధనవంతులు అందరూ మనశ్శాంతి కోల్పోయారు. అంటే డబ్బు ఉన్న వారికి శాంతి లేదు, డబ్బు లేని వారికి శాంతి లేదు. ఉద్యోగం ఉన్న వారికి శాంతి లేదు, ఉద్యోగం లేని వారికి శాంతి లేదు. కారణం ఏమిటి? కారణం ఈ పాపాలే.

అల్లాహ్ సుబ్ హానహు వ త'ఆలా మనందరికీ నాకు చెప్పడం కంటే ఎక్కువగా మీకు వినడం కంటే ఎక్కువగా ఇస్లాంను అర్థం చేసుకొని ఆచరించే సద్బుద్ధిని ప్రసాదించుగాక. అల్లాహ్ మనల్ని ప్రతి సమయంలో ప్రతి సందర్భంలో ప్రతి ప్రదేశంలో ప్రతి మాసంలో ముఖ్యంగా పవిత్ర మాసాలలో ప్రతి చిన్న పెద్ద పాపం నుండి మనల్ని అల్లాహ్ రక్షించుగాక. ఓ అల్లాహ్ అన్ని మాసాలలో ముఖ్యంగా ఈ పవిత్ర మాసాలలో మమ్మల్ని పాపాలు మరియు అవిధేయతల నుండి

కాపాడు. నీ విధేయత మరియు నీ సంతృప్తిని పొందే సత్కార్యాలకు మాకు తౌఫీక్ ప్రసాదించు. మమ్మల్ని నీ సత్ ప్రవర్తన గల దాసులలో చేర్చు. ఆమీన్.

వ ఆఖిరు దవానా అనిల్ హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్. వస్సలాము అలైకుమ్ వ రహ్మాతుల్లాహి వ బరకాతుహు.

సుబ్ హానకల్లాహుమ్మ వ బి హమ్దిక అష్ హదు అన్ లా ఇలాహ ఇల్లా అంత అస్తగ్ ఫిరుక వ అతూబు ఇలైక్.

—

ఈ పోస్ట్ లింక్ :
https://teluguislam.net/?p=46079

Islam, Sunnah, Salafiyyah - Aqeedah & Manhaj of Ahl as-Sunnah wa al-Jamaa'ah (Salaf-us-Salih)